
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 7 । డిసెంబర్ । 2023



సోమశిలలో 34 టీఎంసీల నీరు

సోమశిల: పైతట్టు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. నీటి మట్టం బుధవారం నాటికి 34 టీఎంసీలకు చేరింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.64,130
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,765
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,938
నవర (8 గ్రాములు)	రూ.47,504

గరిష్టం/కనిష్టం
32.0 /23.5

వాతావరణం

బుధవారం గాలిలో తేమ 78 శాతం ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరింది. గురువారం జిల్లాలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ



పాపయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీరు

పొదలకూరు: గత పదిహేను రోజులుగా నెల్లూరు జీజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పట్టణంలోని కాకాణి నగర్‌కు చెందిన పిట్ల పాపయ్యకు వలంటీరు షబ్నా బుధవారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేశారు. పాపయ్య చికిత్స పూర్తి చేసుకుని ఇంటికి వస్తాడని భావించినా ఎంతకూ రాకపోవడంతో వలంటీరు ఆస్పత్రికి వెళ్లి పింఛను నగదు అందజేశారు.

ఉద్యాన పంటలకు రూ.20.70 కోట్ల నష్టం

- జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి



పొదలకూరు: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల జిల్లాలో ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లినట్టు జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పంటలకు రూ.20.70 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచానా వేసినట్లు వెల్లడించారు. 1,412.06 హెక్టార్లలో మిరప, 148.20 హెక్టార్లలో కూరగాయలు, 177.3 హెక్టార్లలో బొప్పాయి, ఒక హెక్టార్లో జామ, 12.90 హెక్టార్లలో పూలతోటలు, 226.90 హెక్టార్లలో అరటి, 2 హెక్టార్లలో మామిడి, 163 హెక్టార్లలో నిమ్మ పంటలు నష్టపోయినట్టు చెప్పారు. ఈ నష్టం పెరిగే అవకాశం కూడా ఉంటుందన్నారు.

పొదుపు మహిళలకు ఆటోలు

నెల్లూరు(పొగతోట): ఉన్నతి (ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్) మహిళా శక్తి పథకం ద్వారా జిల్లాలోని పది మంది ఎస్టీ ఎస్సీ మహిళా లబ్ధిదారులకు ఆటోలు అందజేయనున్నామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మహిళా లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేస్తారని తెలిపారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా వాటిని అందజేస్తారని తెలిపారు.

98.81 శాతం పింఛన్ల పంపిణీ



గొల్లకందుకూరులో అనసూయమ్మకు నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేశ్వరి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. చివరిరోజు బుధవారం 98.81 శాతం మంది లబ్ధిదారులకు కానుక నగదు పంపిణీ చేశారు. 3,15,544 మంది లబ్ధిదారులకు నగదు అందజేయాల్సి ఉండగా 3,11,784 మందికి పంపిణీ చేశారు. వలంటీర్లు వర్షాలు కూడా లెక్కచేయకుండా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు.



జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబుతో కలిసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మిచాంగ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబులు జిల్లా అధికారులతో కలిసి బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జగదేవిపేట, కోట, బాలిరెడ్డిపాళెం, ఉత్తమపాళెం



పట్టల కింద తలదాచుకున్న కుటుంబానికి రొట్టెలను అందజేస్తున్న వలంటీర్లు

బాధితులకు రొట్టెలు అందజేసి...

మిచాంగ్ తుపాను సృష్టించిన బీభత్సం నుంచి కోలుకోని వారికి వలంటీర్లు ఆపన్న హస్తం అందిస్తున్నారు. పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించడం దగ్గర నుంచి వారిని ఇళ్లకు చేర్చడం వరకు వలంటీర్లు కీలక భూమిక పోషించారు. పట్టణంలోని కాకాణి నగర్లో బుధవారం కూడా వలంటీర్ల సేవలు కొనసాగాయి. ఎస్‌డీ షబ్నా, వెంకటరమణ, ప్రణయ్‌లు కలసి కాలనీలో ఉన్న నిరుపేదలకు రొట్టెలను అందజేశారు. వారికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని అధైర్యపడవద్దని భరోసా పలికారు. ఇంటింటికి వెళ్లి తుపాను వల్ల నష్టం వాటిల్లి ఉంటే సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. – పొదలకూరు

పునరావాస కేంద్రాలకు చేర్చి...

మిచాంగ్ తుపాను ప్రభావంతో వింజమూరు 4వ సచివాలయం పరిధిలోని అరుంధతీయవాడ, పాముల కాలనీల్లో పూరిగుడిసెల్లోకి నీరు చేరడంతో అధికారులు సమీపంలోని చర్చిలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ రెండు కాలనీలకు చెందిన సుమారు వంద మందిని పునరావాస కేంద్రానికి చేర్చడంలో వలంటీరు గోచిపాతల బాలవెంగమ్మ నిరంతరం శ్రమించింది. సోమవారం రాత్రి భారీ వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా బాధితులను పునరావాస కేంద్రానికి చేర్చి వారికి అవసరమైన మంచినీరు, ఆహారం అందించారు. విద్యుత్ లేకపోవడంతో చిమ్మచీకట్లు అలుముకున్న సమయంలో వారు ఆహారం తినేంతవరకు టార్చిలైట్లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు అందజేసి వారి ఇళ్లల్లో నీరంతా వెళ్లిపోయాక వారిని ఇళ్లకు చేర్చడంలో కీలక పాత్ర వహించారు. బుధవారం ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థిక సాయం కోసం రెమ్యునరేషన్ నిర్వహించారు. – ఉదయగిరి



రాత్రివేళలో ఆహార పొట్లాలు అందిస్తున్న బాలవెంగమ్మ

రోడ్డుపై వాలిన కర్రతుమ్మ చెట్లను నరికి...

తుపాను సమయంలో సంగం పట్టణంతో పాటు మండలంలో ఏడు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు సుమారు 400 మందిని వలంటీర్లు తరలించారు. అంతేకాకుండా భారీ గాలులకు చెట్లు విరిగిపడడంతో వలంటీర్లు వాటిని నరికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. పునరావాస కేంద్రాలలోని వారికి తాగునీరు, అల్పాహారం, భోజన సేవలు అందించారు. సంగం సచివాలయం–3లో విజయ్‌కుమార్ ఇళ్ల ముంగిట వర్షానికి పడిపోయిన కర్రతుమ్మ చెట్లను నరికి తొలగించారు. పారిశుధ్య కార్యక్రమాల్లో సైతం పాల్గొని తమ వంతు సహాయ సహకారాలు అందించారు. – సంగం



సంగంలో కర్రతుమ్మ చెట్లను నరుకుతున్న వలంటీర్ విజయకుమార్

శెభాష్ వలంటీర్స్



- అధికార యంత్రాంగానికి తోడుగా విరివిగా సేవలు
- అనుక్షణం తుఫాన్ బాధితులకు అండగా
- ప్రాణనష్టం జరగకుండా నివారణ
- జోరు వర్షంలోనూ వైఎస్సార్‌సీపీ నేతల పర్యటనలు, బాధితులకు భరోసాలు
- అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసిన మంత్రి కాకాణి, కలెక్టర్
- పునరావాస కేంద్రాలలో బాధితులకు నాణ్యమైన భోజనం అందజేత



పొదలకూరులో తుపాను బాధితుల ఇళ్లకు వెళ్లి భోజనం అందజేస్తున్న వీఆర్వో శ్రీహరి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏదైనా విపత్కర పరిస్థితుల్లో నేనున్నానంటూ బాధితులకు అండగా నిలిచి వారిలో భరోసా కల్పించడమే అసలైన మానవత్వం. జిల్లాలో నాలుగు రోజుల పాటు మిచాంగ్ తుఫాన్ ధాటికి ప్రజానీకం విలవిలలాడింది. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికార యంత్రాంగాన్ని అనుక్షణం అప్రమత్తం చేసి పెద్దగా ఆస్తి నష్టంతోపాటు ప్రాణనష్టం జరగకుండా చేయగలిగారు. అధికారులతోపాటు వలంటీర్లు, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు తుఫాన్ బాధితులకు మేమున్నాం అంటూ సేవలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

జిల్లాలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తుఫాన్ బీభత్సం సృష్టించింది. నెల్లూరు నగరం చిగురుటాకులా వణికిపోయింది. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో తుఫాన్ ప్రభావితం వల్ల నష్టం వాటిల్లింది. తీర ప్రాంతంలో మిచాంగ్ కల్లోలం సృష్టించింది. కానీ ఎక్కడా కూడా ప్రాణ నష్టం జరగలేదు. కారణం కలెక్టర్ హరినారాయణన్‌తోపాటు అధికార యంత్రాంగం చేసిన సమష్టి కృషే. తుఫాన్ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కలెక్టర్ జిల్లా అధికారులతోపాటు గ్రామస్థాయిలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను అలర్ట్ చేశారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకూడదని ఆర్డీఓ స్థాయిలోనే నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా కంట్రోలు రూంలు ఏర్పాటు చేసి అధికారులను అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 144 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి దాదాపు తొమ్మిది వేల మందికి ఆశ్రయం కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. పునరావాసా కేంద్రాలలో భోజనం అందించేలా చేశారు. అలాగే నిరాశ్రయులకు 40,753 ఆహార పొట్లాలు, 1,31,490 వాటర్ ప్యాకెట్లు అందించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 106 హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయించారు. జోరు వర్షంలో సైతం మత్స్యకార గ్రామాలలో పర్యటించి వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఎస్పీ తిరుమలేశ్వరెడ్డి సైతం పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగారు.

కనిపించని టీడీపీ నేతలు

విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాల్సిన టీడీపీ నేతలు మానవత్వం మరిచిపోయారు. తుఫాన్ కల్లోల పరిస్థితుల్లో ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసా కల్పించాల్సి ఉన్నా టీడీపీ నేతలు ఆ దిశగా అడుగులు వేయలేదు. ఎక్కడా కూడా బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రాకపోవడంపై జిల్లా ప్రజలు నేతల తీరుపై పెదవి విరుస్తున్నారు.

అండగా ప్రజాప్రతినిధులు

మిచాంగ్ బీభత్సానికి జిల్లా వాసులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఆపద సమయంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మహీధర్‌రెడ్డిలతోపాటు నెల్లూరు రూరల్, ఉదయగిరి సమన్వయకర్తలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బాధితులకు మేమున్నామంటూ అండగా నిలిచారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జోరు వర్షంలో సైతం పర్యటిస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించారు. పునరావాస కేంద్రాలలో బాధితులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ సహకారంతో తుఫాన్ బాధితులకు ఆహారం అందించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నగర కమిషనర్‌తోపాటు డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు బాధితులకు మేమున్నాం అంటూ అండగా ఉన్నారు.

మిచాంగ్ ముంచేసింది..!





దెబ్బతిన్న మండలాలు-	19
గ్రామాలు-	114
వరద బాధితుల సంఖ్య-	8529
దెబ్బతిన్న పంటలు-	10,142.2 హెక్టార్లు
అగ్రికల్చర్ పంటలు-	8426.08 హెక్టార్లు
పండ్లతోటలు-	1716.12 హెక్టార్లు

నివాసాలు పూర్తిగా పాడైనవి -	33
పాక్షికంగా దెబ్బతిన్నవి -	12
పాడైన రహదారులు -	505 కి.మీ
పంచాయతీరాజ్ శాఖ రోడ్లు -	5 కి.మీ
తాత్కాలిక మరమ్మతులకు -	రూ.2 లక్షలు
శాశ్వత మరమ్మతులకు-	రూ.6 లక్షలు

దెబ్బతిన్న 33 కేవీ ఫీడర్స్ -	142
11 కేవీ ఫీడర్స్ -	1040
33/11 సబ్‌స్టేషన్లు -	110
11 కేవీ పోల్స్ -	1021
ఎల్‌టీ పోల్స్-	1635
నష్టం తాత్కాలిక అంచనా-	రూ.4.29 కోట్లు

- 10 వేల హెక్టార్లలో పంట నష్టం
- రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు
- కొనసాగుతున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు
- నష్టం అంచనాలలో అధికారులు



వరికుంటపాడు మండలంలో తుపానుకు నేలవాలిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఈ నెల 2 నుంచి 5 తేదీ వరకు మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల పాటు ముసురుపట్టి ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో జిల్లా వాసులు చిగురుటాకులా వణికిపోయారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు 27 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తుపానుకు జిల్లా వ్యాప్తంగా తీవ్ర నష్టం వాటిల్లింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి.

నష్టం అంచనాలలో యంత్రాంగం బిజీ

మిచాంగ్ తుఫాన్ నష్టం అంచనాల్లో జిల్లా అధికార యంత్రాంగం బిజీగా ఉంది. స్థానికంగా వలంటీర్ల సాయంతో అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు. జిల్లాలో 19 మండలాల పరిధిలో 114 గ్రామాల్లో తుఫాన్ ప్రభావం ఉంది. జిల్లాలో 10 వేల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగింది. అందులో వ్యవసాయశాఖ పరిధిలోనే 8 వేల ఎకరాలకు పైచిలుకు నష్టం జరిగింది. హార్టికల్చర్ శాఖ పరిధిలో పడిహేడు వందల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రధానంగా విద్యుత్‌శాఖలోనే భారీ నష్టం వాటిల్లింది. 33 కేవీ ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్‌తో పాటు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో డ్యామేజ్ జరిగింది. 3 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులు రేయింపగళ్లు కష్టపడి 27 సబ్‌స్టేషన్లు పునరుద్ధరించారు. మైపాడు సబ్‌స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ పునరుద్ధరణ కోసం శ్రమిస్తున్నారు. ప్రధానమైన ఇరిగేషన్‌లో కనుపూరు కాలువ మాత్రమే రెండు చోట్ల దెబ్బతింది. మరెక్కడా చెరువులు తెగిపోయిన సంఘటనలు లేకపోవడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అరటి, మిరప తోటలతో పాటు చేపలు, రొయ్యలు గుంటలు దెబ్బతిన్నాయి. ఆయా పంటలకు సంబంధించిన నష్టాన్ని అంచనా వేసి త్వరలోనే ఆర్థిక సాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్ష ప్రభావంతో ఆర్‌అండ్‌బీ రహదారులు కొంత భాగం దెబ్బతిన్నాయి. ఆయా రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేయించేందుకు అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. మరో మూడు రోజుల వ్యవధిలో పూర్తి స్థాయిలో నష్టం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

- పరిశీలించిన సీఎండీ, జెన్‌కో ఎండీ
- 1150 మంది సిబ్బంది విధుల్లో

కు ట్రాక్టర్‌లో ప్రయాణించిన సీఎండీ స్వయంగా విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. స్వర్ణముఖి బ్రిడ్జిలో పడిపోయిన విద్యుత్ లైన్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ జిల్లాలో తాను రెండు రోజులుగా పర్యటిస్తూ విద్యుత్ సరఫరా పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.12 కోట్ల నష్టం చేకూరిందని అన్నారు. గూడూరు డివిజన్‌కు అదనపు సిబ్బందిని పంపి సత్వరమే విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అవసరమయిన విద్యుత్ పరికరాలు, స్తంభాలు, కండక్టర్లు ఏపీఎస్పీడీసీఎల్ అందించేందుకు సిద్ధంగా ఉందని, ఖర్చుకు వెనకాడేదిలేదని అన్నారు. గుంటూరులో తన కుమార్తె వివాహ రిసెప్షన్ ఉన్నప్పటికీ ప్రజల కష్టాలను చూస్తూ వారిని వదిలి వెళ్లలేక ఫోన్ ద్వారానే నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియచేశానని అన్నారు. జిల్లాలో 1150 మంది సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని అన్నారు. తనతోపాటు ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, పద్మజనార్దన్‌లు వచ్చి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాలుపంచుకుని పలు సూచనలు చేస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.



వరద నీటిలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనుల్లో ఆ శాఖ సిబ్బంది

అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ హరినారాయణన్, ప్రత్యేక అధికారి హరికిరణ్, జేసీ కూర్మనాథ్



యంత్రాంగం పనితీరు అభినందనీయం

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- తుపాను సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష
- పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): తుపాను కారణంగా జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచి పెద్ద విపత్తు సంభవించినప్పటికి అధికార యంత్రాంగం ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ సమర్థవంతంగా పనిచేయడం వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంత్రి కాకాణి, జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిలతో కలసి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్, వైద్యారోగ్యశాఖ, అగ్నిమాపక, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, వ్యవసాయ దాని అనుబంధశాఖల జిల్లా అధికారులతో సమావేశమై తుపాను అనంతరం చేపట్టాల్సిన సహాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని అన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించినప్పటికీ కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదని, బుధవారం రాత్రికి అక్కడ కూడా సరఫరా పునరుద్ధరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏ రైతు నష్టపోయామనే భావన రైతుల్లో కలగకుండా క్షేత్రస్థాయిలో రైతాంగానికి అండగా ఉంటూ దెబ్బతిన్న పంటలకు తిరిగి పంటలు సాగు చేసుకునేందుకు 80 శాతం రాయితీతో విత్తనాలు అందచేయడం, పంట పొలాల్లో వర్షపు నీరు ఉంటే ఆ నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న ఇరిగేషన్ కెనాల్స్‌ను, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లను తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలు, రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉండి తిరిగి వారి నివాసాలకు వెళ్లే బాధిత కుటుంబాలకు రూ.2500 వంతున, వ్యక్తికి రూ.1000 వంతున నగదు పంపిణీ చేయడంతో పాటు 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, కిలో పామాయిల్, కేజీ ఎర్రగడ్డలు, కేజీ బంగాళాదుంపలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలు, వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి సూచనలు పాటిస్తూ జిల్లా అధికార యంత్రాంగం సుమారు 80 శాతం మేర సహాయక చర్యలు చేపట్టిందని, మిగిలిన 20 శాతం త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మిగిలిపోయిన విద్యుత్ పునరుద్ధరణ పనులను, శానిటేషన్, తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తొలుత కలెక్టర్ హరినారాయణన్ తుపాను కారణంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు, తుపాను అనంతరం చేపడుతున్న సహాయక, పునరావాస కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జేసీ కూర్మనాథ్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఆర్‌ఓ లవన్న వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.6

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.88
లేయర్	రూ.90
బ్రాయిలర్ చికెన్:	రూ.166
స్కిన్‌లెస్ చికెన్:	రూ.186
లేయర్ చికెన్:	రూ.153

12 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు విధులు బహిష్కరించనున్నట్లు ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం సుందరయ్యయాదవ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 9న జాతీయ లోక్‌అదాలత్ ఉన్నందున ఆ రోజును మినహాయిస్తున్నామని, న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని ఆయన కోరారు.

వరద సాయాన్ని తక్షణమే అందించండి

- కలెక్టర్‌ను కోరిన ఎంపీ ఆదాల, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ కారణంగా ప్రజలకు జరిగిన ఇబ్బందులు, నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని వరద సాయాన్ని తక్షణమే అందించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్‌ను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. బుధవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు దెబ్బతినడంతో తలెత్తిన విపత్కర పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. తొలుత ఎంపీ ఆదాల మాట్లాడుతూ ప్రభుత్వ వరద సాయం రూ.2,500 నగదుతో పాటు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులను అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముంపును ఎదుర్కొన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించి అండగా ఉంటామని ఎంపీ తెలిపారు.

నష్ట నివారణ చర్యలు త్వరితగతిన చేపట్టండి

మిచాంగ్ తుఫాన్ కారణంగా ఆత్మకూరు నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్ట నివారణకు త్వరితగతిన చర్యలు చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పొగాకు, మిర్చి, మొక్కజొన్న, తదితర పంటలతో పాటు వరి నారుమడులు దెబ్బతిన్నట్లు పలు మండలాల నుంచి రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యంగా ఏఎస్‌పేట మండలంలో 250 ఎకరాల్లోని మొక్కజొన్న పంట దెబ్బతిందని చెప్పారు. మర్రిపాడు, అనంతసాగరం, సంగం, చేజర్ల మండలాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. చేజర్ల, సంగం మండలాల్లో అధిక నష్టం జరిగిందని వివరించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, రోడ్ల పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించిన సమయంలో అక్కడి ప్రజలు అధికారులు, తమకు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లోని బాధితులను సురక్షితంగా ఇంటికి పంపించాలని, ముఖ్యమంత్రి సూచించిన విధంగా బాధితులకు నగదు సాయం అందజేయాలని కోరారు. వారి వెంట విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఉన్నారు.

వరద నీటి తొలగింపునకు చర్యలు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్‌తో పంట పొలాల్లో నిలిచిన వరద నీటిని త్వరితగతిన తొలగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ అనంతర సహాయ చర్యలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ ఎం హరినారాయణన్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, జిల్లా ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ కమిషనర్ సీ హరికిరణ్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంకు జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ వివరించారు. తుఫాన్ ప్రభావంతో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో 27 సెం.మీల వర్షపాతం నమోదైందని తెలిపారు. 19 మండలాలు తుఫాన్‌కు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వివరించారు. జిల్లాలో 144 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, దాదాపు 8 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన నష్టం ప్రాథమిక అంచనా మేరకు ఇరిగేషన్ పరంగా కనుపూరు కాలువకు రెండు చోట్ల గండ్లు పడ్డాయని చెప్పారు. విద్యుత్‌కు సంబంధించి 27 సబ్‌స్టేషన్లను పునరుద్ధరించామని, మైపాడు సబ్‌స్టేషన్‌ను రాబోయే 24 గంటల్లో అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయపరంగా వరినారు మడి దశలో ఉన్నదని, ఇందుకూరుపేట మండలంలో అరటి, మిరప కొద్దిగా దెబ్బతిన్నాయని, 300 చేపల చెరువులు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా గుర్తించామన్నారు. రాబోయే మూడు రోజుల్లో పూర్తి స్థాయి నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తుఫాన్ సహాయ చర్యలపై రాజకీయం సిగ్గుచేటు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: గతంలో రాష్ట్రాన్ని పాలించిన అనుభవాన్ని కూడా మరిచి తుఫాన్ సహాయక చర్యలపై చంద్రబాబు రాజకీయం చేయాలని చూడడం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. మండల రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలను తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై అంజనేయులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తుఫాన్‌పై ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించిందన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి అక్కడ వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ విధంగా రేయింబవళ్లు ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుంటే చంద్రబాబు కళ్లు ఎక్కడికి పోయాయో చెప్పాలన్నారు. 9 ఏళ్లు ఉమ్మడి రాష్ట్రం, 5 ఏళ్లు నవ్యాంధ్ర ప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవంతో ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చే ఆలోచన చేయకుండా రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా నీతిమాలిన రాజకీయాలు చేయడం మానుకోవాలని చంద్రబాబుకు హితవుపలికారు. చంద్రబాబు బతుకంతా కుట్రలు, కుతంత్రాలేనని విమర్శించారు. చంద్రబాబు పిచ్చి మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఇది ప్రజల ప్రభుత్వమని, జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ఎన్ని రాజకీయాలు చేసినా ప్రజలు ఆయన్ని నారావారిపల్లెలో కూర్చోపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీపీ వేణుంబాక భవానమ్మ, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, ఆవుల వాసు, బుచ్చంగారి తిరుపతయ్య, యేనేటి ప్రసాద్ పాల్గొన్నారు.

24 గంటల్లోనే వరద సాయం

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: మిచాంగ్ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించిందని, వరద సాయాన్ని 24 గంటలు తిరగక ముందే బాధితులకు అందించామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు, నగదు సాయాన్ని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ వల్ల లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారిని గుర్తించి వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. పట్టణంలోని ఏఎంసీ గోదాము, పాలిటెక్నిక్ కళాశాల, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 171 మంది ఆశ్రయం పొందారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరందరికీ భోజన సౌకర్యంతో పాటు, అన్ని వసతులు కల్పించామని చెప్పారు. వరద తగ్గి ఇంటికి వెళ్లే క్రమంలో వారికి అవసరమైన నిత్యావసర వస్తువులు, నగదు సాయం అందించామని చెప్పారు. ఒక్కొక్కరికి రూ.1000 నగదుతో పాటు, బియ్యం, పప్పులు, నూనె, ఉల్లిపాయలు, కూరగాయలు అందిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో ఇద్దరు ఉంటే రూ.2వేలు, అంతకు మించి ఉంటే రూ.2,500 నగదు అందిస్తున్నట్లు చెప్పారు. దీన్ని బట్టి పేదల పట్ల ముఖ్యమంత్రికి ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చని వివరించారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

- ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి



హోంగార్డు ప్రభాకర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణతో పాటు వివిధ విభాగాల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి కొనియాడారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 61వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్, ఐటీ కోర్‌టీం, మోటార్ ట్రాన్స్‌పోర్టు, ఫైర్ తదితర విభాగాల్లో పోలీసులకు దీటుగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. మిచాంగ్ తుఫాన్ విపత్తు సమయంలో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణతో పాటు కుటుంబంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో హోంగార్డులు, వారి కుటుంబసభ్యులకు రాయితీతో కూడిన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాఖాపరమైన సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరింత కష్టపడి విధులు నిర్వహించాలన్నారు. నీతి, నిజాయతీ, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖ ప్రతిష్ట ఇనుమడింపజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్పీ డీ హిమవతి మాట్లాడుతూ జిల్లాలో 709 మంది హోంగార్డులు లా అండ్ ఆర్డర్‌తో పాటు వివిధ విభాగాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. రొట్టెల పండగ, వినాయకచవితి, దసర, తిరుమల, విజయవాడ బ్రహ్మోత్సవాలు, వీవీఐపీ, వీవీఐపీ బందోబస్తుల్లో ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొస్తున్నారన్నారు. ఈ ఏడాది విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులు వీ ప్రభాకర్ (నవాబుపేట), టీ సురేష్ (కావలి), సీహెచ్ హజరత్తయ్య (ఆత్మకూరు), ఏ శ్యామ్సన్ (ఆర్టీఓ కార్యాలయం), డీ శ్రీదేవి (ముత్తుకూరు), పీ శివకుమారి (సీసీఎస్)లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం నగరంలో హోంగార్డులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, హోంగార్డ్స్, ఏఆర్, నగర, ట్రాఫిక్, ఆత్మకూరు, ఎస్సీ, ఎస్టీ సెల్-2 డీఎస్పీలు చంద్రమోహన్, గాంధీ, డీ శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ సుభాన్, కోటారెడ్డి, శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణారెడ్డి, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.